# రాజేంద్రనగర్ ప్రజల అవసరాలను తీరుస్తా..

**• సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్**



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళ



మైలార్‌దేవ్‌పల్లిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సత్కరించిన వ్యాపారులు, ప్రజలు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 14 : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, అభివృద్ధి పనులు చేపడుతానని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా 4వ సారి భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేశ్‌నగర్ బంగారు మైసమ్మ దేవాలయ ఆవరణలో మార్కెట్ స్ట్రీట్ వెండర్స్, దుకాణదారులు, స్థానికులు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ నాలుగోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి గెలిపించారని పేర్కొన్నారు. మరింత క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రజల అవసరాలను తీరుస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్ గౌడ్, బాస శ్రీను, గట్టయ్య, వివేక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

**• మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల**

సైదాబాద్, డిసెంబర్ 14 : ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చొరవ చూపాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ఆస్మాన్‌ఘడ్ ప్రాంతంలో రోడ్లు అధ్వానంగా మారాయని, మరమ్మతులతోపాటు కొత్త రోడ్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలో వీధి దీపాలు సక్రమంగా వెలుగక రాత్రివేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ దీపాలు లేని చోట కొత్త దీపాలను ఏర్పాటు చేసి వాటి నిర్వహణను సక్రమంగా చూడాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకోవటానికి డివిజన్ల వారీగా కాలనీల్లో పర్యటిస్తానని, అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేసే అధికారులను ఉపేక్షించేది లేదని, స్థానిక సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని ఆయన అదేశించారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, ఆస్మాన్‌ఘడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.



ఆస్మాన్‌ఘడ్‌లో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

# దేశవ్యాప్తంగా చిరుధాన్యాల ఉత్పత్తులకు ఆదరణ

**• ప్రతి విద్యార్థికీ మిల్లెట్స్‌పై అవగాహన ఉండాలి • ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారాసత్యవతి**

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 14 : చిరుధాన్యాల ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా ఆదరణ పెరిగిందని, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ(ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ సి. తారాసత్యవతి సూచించారు. గురువారం రాజేంద్రనగర్(ఐసీఏఆర్-ఐఐఎంఆర్) కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. దేశంలో కరోనా అనంతరం ఈ ఏడాది(మిల్లెట్స్ ఇయర్-2023)చిరుధాన్యాల ప్రాధాన్యత పెరిగిందన్నారు. తదనుగుణంగా ఫిబ్రవరిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం రూ. 250 కోట్లు కేటాయించడంతో చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇతర దేశాల శాస్త్రవేత్తలు సైతం పలు సూచనలు, సలహాలు చేయడంతోపాటు తీసుకున్నట్లు వివరించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, ఒడిశా, చత్తీస్‌ఘడ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్తాన్ రాష్ట్రాల్లో చిరుధాన్యాల సాగు పెరిగిందన్నారు. జీ 20 సదస్సులో ప్రత్యక్షంగా, పరోక్షంగా మిల్లెట్స్‌పై అవగాహన కల్పించామన్నారు. వాణిజ్య పంటలు వేసి నష్టాలు చవిచూడవద్దని రైతులకు సూచించారు.



ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారాసత్యవతి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఆయుష్ డైరెక్టర్ డాక్టర్ జీపీ ప్రసాద్

## ఆయుష్‌లో చిరుధాన్యాల వినియోగంపై ..

సైదాబాద్ : అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం (ఐవైఎం-2023)లో భాగంగా గురువారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఆయుష్) సంస్థలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రాగి జావను తయారు చేసే విధానాన్ని వివరించారు. అరెకలు, కొర్రలు, సామెలు, ఊదలు, సజ్జలు, జొన్నలు, వరికలు ప్రదర్శించి వాటిని తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు సంస్థ డైరెక్టర్ డాక్టర్ జీపీ ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


## విద్యార్థులకు వరి, చిరుధాన్యాల ఉత్పత్తులపై అవగాహన

నగరంలోని బాలాపూర్‌లోని డిఫెన్స్ ల్యాబరేటరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా గురువారం భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ(ఐఐఎంఆర్)ను సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను పలుకరించిన డైరెక్టర్ డాక్టర్ తారాసత్యవతి వరి సాగు, బియ్యం తయారీ,చిరుధాన్యాల ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. అనంతరం మిల్లెట్స్ సాగు, తినుబండారాల తయారీ ప్రదేశాలకు విద్యార్థులను తీసుకెళ్లిన శాస్త్రవేత్తలు వాటిపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు అనందిత, విభాశ్రీవాత్సవ, అశోక్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.



జొన్న పంటను విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్త

## ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్కూడ వాసులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 14 : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ నాలుగోసారి గెలుపొందడంతో శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామానికి చెందిన ఆయన బంధువులు గురువారం ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో పి. విష్ణు, పి రాజు, చంద్రశేఖర్, నర్సింహ, నరేశ్ తదితరులు ఉన్నారు.

## అయ్యప్పస్వామి మహా పడిపూజ



మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంకు కాలనీలో రాఘువేంద్ర గురుస్వామి ఆధ్వర్యంలో 18వ అయ్యప్పస్వామి మహాపడిపూజను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం అయ్యప్పలకు అన్నప్రసాదం నిర్వహించారు. పోచబోయిన ఈశ్వరమ్మ, పోచబోయిన జగదీశ్, కిరణ్ పాల్గొన్నారు. *– మన్సూరాబాద్, డిసెంబర్ 14*

## ర్యాగింగ్‌కు పాల్పడితే 6 నెలల జైలు

**• సీనియర్ సివిల్ జడ్జి కళార్చన**




అవంతి పీజీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి, సీసీసీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కళార్చన

మలక్‌పేట, డిసెంబర్ 14 : ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, ప్రత్యక్షంగా, పరోక్షంగా ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షార్హులని సీనియర్ సివిల్ జడ్జి, సీసీసీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి జి.కళార్చన పేర్కొన్నారు. గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి పీజీ కళాశాలలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే సరస్వతీ నిలయాలన్నారు. తోటి విద్యార్థులపై వికృత చర్యలు ర్యాగింగ్ కిందకే వస్తాయని, ర్యాగింగ్‌కు పాల్పడితే 6 నెలల నుంచి రెండేండ్లపాటు జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తారని తెలిపారు. సుప్రీం కోర్టు సూచనల ప్రకారం ఏ విద్యార్థి అయినా ర్యాగింగ్ బారిన పడినపుడు అవసరమైన సహాయం కోసం ఎవరిని సంప్రదించాలో కళాశాల యాజమాన్యం తెలియజేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులను తరచూ సంప్రదిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఇన్‌చార్జి మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



సైదాబాద్, డిసెంబర్ 14 : సైదాబాద్ డివిజన్ పరిధిలోని నాగులమ్మ ఆలయం నుంచి రెడ్డి బస్తీలోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు రోడ్లను గురువారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణ పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన రోడ్ల స్థానంలో కొత్త రోడ్ల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈ వెంకన్నగౌడ్‌ను ఆమె అదేశించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కే. రవీందర్‌రెడ్డి, రవికుమార్, శ్రీకాంత్, వెంకటేశ్, రాజు, మల్లారెడ్డి, జగన్నాథ్, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.